బీఆర్ఎస్ పార్టీ భువనగిరి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో జగదీశ్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌లో అధికార అహంకారం

అదానీ, ప్రధానీ ఒక్కటేనని నేడు వారితోనే రేవంత్ దోస్తీ

నాడు ప్రచారంలో అబద్ధం.. నేడు పాలనలో అసహనం

- తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుకు కూడా కర్ణాటక గతే
- ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ హామీ ఏమైంది?
- నర్సింగ్ ఉద్యోగాలు మేమిస్తే.. ఆర్డర్ కాపీలు ఇచ్చి గొప్పలా?
- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే నల్లగొండకు నీళ్లెట్ల?
- తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష: హరీశ్‌రావు
- భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నామనే అహంకారంతో వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. నాడు ప్రచారంలో అబద్ధాలు వల్లెవేసిన కాంగ్రెస్.. నేడు పాలనలోనూ అసహనం ప్రదర్శిస్తున్నదని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ అదానీ, ప్రధాని ఒక్కటని చెప్పి ప్రచారం చేస్తుంటే.. రాష్ట్రంలో రేవంత్ వారితోనే దోస్తీ కడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోకి అదానీ రాకుండా బీఆర్ఎస్ నిలువరించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్రంలోకి ఎందుకు ఆహ్వానించిందని ప్రశ్నించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో భాగంగా భువనగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ వేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని కాంగ్రెస్ సర్కారును నిలదీశారు. నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తే.. కాంగ్రెస్ ఆర్డర్ కాపీలు ఇచ్చి గొప్పలు చెప్పుకొంటున్నదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారును అక్కడి ప్రజలు తిరస్కరిస్తున్నారని, అక్కడ 25 ఎంపీ స్థానాల్లో నాలుగైదు మాత్రమే వస్తాయంటున్నారని, ఇక్కడ కూడా హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని అన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.15వేల కోట్ల అప్పులు చేసిందని తెల్పి చెప్పారు. ఎన్నికల్లో నోటికొచ్చినట్టు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రచారం చేశారని, అసలు ఎన్నికల్లో బీజేపీని ఓడించిందే తమ పార్టీ అని చెప్పారు. నాడు ఎమ్మెల్సీ సీట్ల విషయంలో గవర్నర్ అడ్డంకులు సృష్టించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలను క్షణాల్లో ఆమోదిస్తున్నారని, బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అనేందుకు ఇదే నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ 420 హామీలపై చర్చ పెట్టండి

అందరం రామ భక్తులమేనని, బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను బీజేపీ ఏపీకి లాక్కెళ్లిందని, లోయర్ సీలేరు గుంజుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. 'ఎన్నికల హామీలను నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదు? రూ.4 వేల పింఛన్ దేవుడెరుగు.. 2వేల పింఛన్ కూడా సరిగా ఇస్తలేరు. పోయిన నెల పింఛన్ ఈ నెల ఇచ్చిన్రు. 12 నుంచి 14 గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదు. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతన్నలు మొత్తుకుంటున్నారు. దళిత బంధు డబ్బులను ఫ్రీజ్ చేశారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలి. కాంగ్రెస్ 420 హామీలపై గ్రామాలు, తండాల్లో చర్చ పెట్టండి' అని హరీశ్‌రావు కార్యకర్తలకు సూచించారు.

కోమటిరెడ్డీ.. కేఆర్ఎంబీపై స్పందించు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కిందని హరీశ్‌రావు మండిపడ్డారు. 'అధికారం ఉన్నదనే అహంకారం కోమటిరెడ్డిలో కనిపిస్తున్నది. బీఆర్ఎస్ 39 ముక్కలు అవుతుందంటడు. రైతుబంధు అడిగినోడిని చెప్పుతో కొట్టమంటడు. రైతుబంధు ఎప్పుడిస్తరని అడిగినందుకు యాదాద్రి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని పోలీసులను పెట్టి గెంటించిండు. ఈ అహంకారాన్ని ప్రజలు సంహించరు. తప్పకుండా తగిన గుణపాఠం చెప్తారు. కోమటిరెడ్డికి నిజంగా నల్లగొండ జిల్లాపై ప్రేమ ఉంటే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడంపై మాట్లాడాలి. ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగిస్తే నల్లగొండ జిల్లాకు తాగు, సాగునీరు రాదు. ప్రాజెక్టులే మన చేతిలో లేకుంటే శ్రీశైలంలో జల విద్యుదుత్పత్తి జరుగకపోతే సాగర్‌కు నీళ్లొస్తయా? సాగర్‌కు నీళ్లు రాకపోతే ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నడుస్తుందా? సాగర్ ఎడమ కాల్వకు నీళ్లొస్తయా? కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తే నల్లగొండ జిల్లాకు తీరని ద్రోహం జరుగుతుంది. నాడు వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు పులిచింతల ప్రాజెక్టు కట్టి ఆంధ్రాకు నీళ్లిచ్చారు. నేడు ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే ప్రజలకు తీరని నష్టం జరుగుతుంది. కోమటిరెడ్డి అసలు దీనిపై మాట్లాడు.' అని సవాల్ విసిరారు. 2021లో నిర్ణయం తీసుకున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని, కాంగ్రెస్ పైకి అప్పగించబోమని అంటూనే సంతకాలు పెడుతున్నదని విమర్శించారు.

కాంగ్రెస్‌ను ప్రజలే బొందపెడ్తరు: జగదీశ్

అధికారం ఉన్నదని రెచ్చిపోతే కాంగ్రెస్ రాజకీయంగా చరిత్రలో కనుమరుగవుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్‌ను బొంద పెడ్తామని, జైళ్లో వేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, కేసీఆర్‌ను అది చేస్తాం.. ఇది చేస్తమని అంటున్నవారు ఒక్కసారి ముట్టుకొని చూడాలని వార్నింగ్ ఇచ్చారు. 20 ఏండ్లలో కోమటిరెడ్డి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలని అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు రాజకీయంగా బొంద పెడతారని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీని ఆపే సత్తా ఆ ముగ్గురికే!

- కేసీఆర్, మమత, కేజ్రీవాల్‌కే సాధ్యం
- కాంగ్రెస్ పార్టీకి అంత సత్తా లేదు
- కృష్ణా జలాలను ఢిల్లీకి తాకట్టు పెట్టిన రేవంత్‌రెడ్డి
- 50 రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కేటీఆర్



మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో శుక్రవారం నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు

మేడ్చల్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీజేపీని అధికారంలోకి రాకుండా ఆపే సత్తా కేసీఆర్, మమతాబెనర్జీ, కేజ్రీవాల్‌కే ఉన్నదని, కాంగ్రెస్‌కు ఆ సత్తా లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పష్టంచేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెక్ పెట్టాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో శుక్రవారం నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటాను ప్రధాని మోదీ పదేండ్లుగా తేల్చడం లేదని విమర్శించారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృష్ణా జలాలను తాకట్టు పెట్టి వచ్చారని దుయ్యబట్టారు. తెలంగాణ వాటా తేల్చకుండానే కేఆర్ఎంబీకి కృష్ణా జలాలను అప్పగించారని మండిపడ్డారు. కృష్ణా నదిపై ప్రాజెక్ట్ కట్టాలన్నా, చుక్కనీరు తీసుకోవాలన్నా ఢిల్లీ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితిని రేవంత్‌రెడ్డి కల్పించారని విమర్శించారు. కేంద్రం నుంచి తెలంగాణ హక్కులను సాధించుకోవాలన్నా, కాంగ్రెస్, బీజేపీని నిలదీయాలన్నా పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం ఉండాలని వివరించారు. కేంద్రం నుంచి మన హక్కులను సాధించుకోవడం బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలతో సాధ్యం కాదని పేర్కొన్నారు. మన హక్కుల కోసం, కృష్ణా జలాల కోసం కొట్లాడుతున్నది బీఆర్ఎస్ ఎంపీలేనని చెప్పారు. కేంద్రం నుంచి రాజ్యాంగబద్ధంగా రావాల్సినవన్నీ వస్తాయని, ఇంకా అదనంగా సాధించుకోవాలంటే ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ ఎంపీలకే ఉంటుందని తెలిపారు.

50 రోజుల్లోనే ప్రజా వ్యతిరేకత

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన యాభై రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, దీనితో వాటిని అమలు చేసే ఉద్దేశం లేదని చెప్పినట్టైందని పేర్కొన్నారు. 420 హామీలను అమలు చేయలేనని చెప్తున్న ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కోడళ్లకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారని, రాష్ట్రవ్యాప్తంగా కోటీ 57 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, హెల్త్‌సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయాలని తీర్మానం

కుత్బుల్లాపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేటీఆర్ మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్ మాట్లాడుతూ.. కేటీఆర్ పోటీ చేస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

బీఆర్ఎస్‌ను వీడే ఆలోచన లేదు

- మాజీ ఎమ్మెల్యే మర్రి స్పష్టం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్ పార్టీని వీడే ఆలోచన తనకు లేదని, కొందరు మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ తనకు దైవ సమానులని, ఆయనకు చెప్పకుండా తాను ఏ నిర్ణయం తీసుకోనని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నాగర్‌కర్నూల్‌లో మాట్లాడారు. అన్ని పార్టీల వారు మల్కాజిగిరి నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని అడిగిన మాట వాస్తవమని తెలిపారు. కానీ తాను పార్టీ మారుతున్నట్టు ఇప్పటివరకు ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. తాను ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడినట్టు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు.

50 రోజుల్లోనే రేవంత్ యూటర్న్

- అప్పుడే 14 వేల కోట్ల అప్పులు
- హామీలు అమలు చేయకలేకపోతే ముక్కు నేలకు రాసి దిగిపోవాలి
- వికారాబాద్ బీఆర్ఎస్ సమావేశంలో వేముల

వికారాబాద్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నాగేందర్‌గౌడ్ తదితరులు

వికారాబాద్, ఫిబ్రవరి 2, (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన యాభై రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీల అమలుపై యూ టర్న్ తీసుకున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటిదాకా 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే హామీలు అమలవుతాయని ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే, హామీలను అమలు చేయకుంటే ముక్కు నేలకు రాసి, సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రూ.14 వేల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రెండు నెలల్లో రేవంత్‌రెడ్డి ప్రజలను ఎన్నిసార్లు కలిశారు? ఎన్ని సమస్యలను పరిష్కరించారో సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెట్టాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు ఊరుకోరని, ఎక్కువ రోజులు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగదని స్పష్టంచేశారు. మొన్నటి ఎన్నికల్లో కారుకు స్పీడ్ మాత్రమే బ్రేక్ పడిందని, కరెంట్, తాగునీరు, సాగునీరు అందించేందుకు పదేండ్లు 24 గంటలు పనిచేశామని, అభివృద్ధి గురించి ఆలోచించి, పార్టీ గురించి పట్టించుకోలేకపోయామని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

మార్చి 17 తర్వాత ఉద్యమించుడే

- అప్పటిలోగా 420 హామీలు అమలు చేయాల్సిందే
- మంథని బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి హెచ్చరిక

మంథని, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు మార్చి 17లోగా అమలుకాకపోతే ఉద్యమించుడేనని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో కరెంట్ కోతలంటే తెలియని తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ మొదలయ్యాయని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మంథని బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకేసీఆర్ తన పదవీకాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం తప్ప ఎన్నడూ కాంగ్రెస్ తప్పులను ఎత్తి చూపని గొప్ప నాయకుడని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములకు సాగు నీరు అందక బీళ్లుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు నాయకుడు లేక పూటకో పార్టీ తిరిగే రేవంత్‌రెడ్డిని సీఎంను చేశారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, 2వ తేదీ దాటినా ఆ ఊసే లేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలంతా ఇప్పుడు బాధ పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను, కేసీఆర్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఇక కాంగ్రెస్‌కు ప్రజలు ఓట్లు వేయరని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు.

మోసానికి కేరాఫ్ కాంగ్రెస్

- అమలుకాని 420 హామీలు
- విదేశాల్లో తెలంగాణ పరువు తీసిన సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి సత్యవతి ఆగ్రహం
- ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం: శ్రీనివాస్‌గౌడ్

మక్తల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్, చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రజినీ సాయిచంద్

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ అంటేనే మోసానికి కేరాఫ్ అని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అమలుకాని 420 హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ దుయ్యబట్టారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. తెలంగాణను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ అధికారంలోకి రాగా విదేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం పరువు తీశారని ధ్వజమెత్తారు. దావోస్‌లో బీఆర్ఎస్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బొందపెట్టడం ఎవరి తరం కాదని చెప్పారు.

పార్లమెంట్ పోరులో బీఆర్ఎస్‌దే విజయం: శ్రీనివాస్‌గౌడ్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు పార్టీ క్యాడర్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలకు, నాయకులకు మధ్య సమన్వయ లోపం కారణంగానే ఓటమి చవిచూడాల్సి వచ్చిందని తెలిపారు. సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసిన క్రమంలో కార్యకర్తలను పట్టించుకోలేకపోయామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓటర్ లిస్టులు పట్టుకొని బీఆర్ఎస్ నేతలు తిరుగుతుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం పథకాలు అందని వారి జాబితా పట్టుకొని అసత్య ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీ సాయిచంద్, చిట్టెం సుచరితారెడ్డి, దేవరి మల్లప్ప, మాజీ సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాలన్నీ ఉత్తరాది వారికే!

మొదటిపేజీ తరువాయి...

నెరవేరడం లేదు. దీనిపై ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం గానీ, రైల్వే శాఖ మంత్రి గానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

అసిస్టెంట్ లోకో పైలెట్ల భర్తీకి భారీ నోటిఫికేషన్

దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల పరిధిలోని ఆర్ఆర్‌బీల ఆధ్వర్యంలో 5,696 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల భారీ నోటిఫికేషన్ విడుదల చేశారు. డిప్లొమా, ఇంజినీరింగ్ లాంటి టెక్నికల్ విద్యలు నేర్చుకున్న నిరుద్యోగ యువతను ఈ పోస్టుల్లో భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. వీటిలో దాదాపు 750 పోస్టులు సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ పరిధిలో భర్తీ చేయనున్నారు. మెరిట్‌తోపాటు కంప్యూటర్ బేస్డ్ టెస్టులు, ఇంటర్వ్యూల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నప్పటికీ అసలైన రాత పరీక్షలను మాత్రం హిందీ, ఇంగ్లిష్‌లోనే నిర్వహిస్తున్నారు. అంటే హిందీ, ఇంగ్లిష్ భాషలు నేర్చుకున్న వారికే ఆర్ఆర్‌బీ ప్రాధాన్యమిస్తున్నది. దేశంలోని ఎన్నో మాతృ భాషలు ఉన్నప్పటికీ తప్పనిసరిగా హిందీ, ఇంగ్లిష్ భాషలను నేర్చుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నది. తద్వారా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఏపీ యువతకు రైల్వే ఉద్యోగాలు ఎన్నటికీ లభించవని కేంద్ర ప్రభుత్వం చెప్పకనే చెప్తున్నది.

అంతా కేంద్రం చేతుల్లోనే: అరుణ్‌కుమార్ జైన్

ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం 19 రైల్వే జోన్లు ఉన్నాయి. వాటిలో 21 ఆర్ఆర్‌బీలు పని చేస్తున్నాయి. రైల్వే ఉద్యోగాల భర్తీకి ఈ బోర్డులన్నీ కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాయి. దీంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడ రైల్వే ఉద్యోగాలను భర్తీ చేసినా అవన్నీ ఉత్తరాదివారికే దక్కుతున్నాయి. తెలుగు యువతకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా.. రైల్వే ఉద్యోగ పరీక్షలను తెలుగులో నిర్వహించే అంశం కేంద్రం చేతుల్లోనే ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని తప్పకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలను తెలుగులో రాసేందుకు అనుమతించాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అయినా రైల్వే బోర్డు మాత్రం దిగిరావడం లేదు. దీనిపై తెలుగు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు వెంటనే స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని చాలిన్న అవసరం ఎంతైనా ఉన్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

చంద్రబాబు, వైఎస్‌తోనే కాలేదు

- వారి శిష్యులైన మీతోటి ఏమైతది?
- బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం అసాధ్యం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కొత్తపల్లి, ఫిబ్రవరి 2: బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం చంద్రబాబు, వైఎస్సార్ వల్లనే కాలేదని, వారి శిష్యులైన రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఏమవుతుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులతో శుక్రవారం కొత్తపల్లి మండలం చింతకుంటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో బంజారాలు ముందున్నారని, వారి అభివృద్ధి కోసం కేసీఆర్ 10% రిజర్వేషన్లు కల్పిస్తే, కేంద్రం కుట్రపూరితంగా అడ్డుకున్నదని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీద కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో నాయకులు విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. తెలంగాణలో కేసీఆర్ ఇచ్చిన 1,60,083 మంది ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి గత రెండు నెలలుగా వేతనాలు వేస్తున్నారో లేదో చెప్పాలని సవాల్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎగిరేది బీఆర్ఎస్ జెండాయేనని ధీమా వ్యక్తంచేశారు.

రైల్వేకు అరకొర నిధులే

- దక్షిణమధ్య రైల్వేకి విదిల్చింది రూ.14,232 కోట్లే
- అందులో ఆంధ్రప్రదేశ్‌కే రూ.9,138 కోట్లు కేటాయింపు
- తెలంగాణకు రూ.5,071 కోట్లతో సరిపెట్టిన కేంద్రం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్భాటాలే తప్ప సరైన కేటాయింపులు కనిపించడం లేదు. రైల్వేలకు అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు జరిపిన కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయి. ఈ జోన్‌కు కేవలం రూ.14,232.84 కోట్లు కేటాయించారు. ఆ నిధుల్లో తెలంగాణకు రూ.రూ.5071 కోట్లు మాత్రమే విదిల్చారు. రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టుల ఊసెత్తలేదు. డబుల్, ట్రిపుల్ లైన్ల పేరుతో గతంలో మంజూరైన ప్రాజెక్టులకు స్వల్పంగా నిధులు కేటాయించడం మినహా చెప్పుకోదగ్గ కొత్త ప్రాజెక్టులేమీ ప్రకటించలేదు. దీనితోపాటు ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో ఉద్యోగులకూ ఏమీ ఒరగలేదన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి.

ద.మ. రైల్వేకి కేటాయింపులు ఇవీ..

- భద్రాచలం రోడ్-డోర్నకల్ మధ్య 54.65 కి.మీ. లైన్ డబ్లింగ్‌కు రూ.770.12 కోట్లు.
- కాజీపేటలో రైలు వ్యాగన్ల తయారీ యూనిట్‌కు రూ.150 కోట్లు.
- కాజీపేట-విజయవాడ మూడో లైన్ పనులకు రూ.310 కోట్లు.
- బీబీనగర్-గుంటూరు లైన్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు.
- ఎంఎంటీఎస్ ఫేజ్-2కు రూ.50 కోట్లు, యాదాద్రి వరకు ఫేజ్-2 పొడిగింపునకు రూ.10 కోట్లు.
- మనోహరాబాద్-కొత్తపల్లి మధ్య కొనసాగుతున్న కొత్త లైన్ నిర్మాణ పనులకు రూ.350 కోట్లు.
- కొత్తపల్లి-నర్సాపూర్ మధ్య కొనసాగుతున్న కొత్త లైన్ నిర్మాణానికి రూ.300 కోట్లు.
- అకోలా-డోన్ మధ్య కొనసాగుతున్న డబ్లింగ్ పనులకు రూ.220 కోట్లు.
- సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధికి రూ.540 కోట్లు.
- ఔరంగాబాద్-అంకాయ్ మధ్య 98.25 కి.మీ. డబ్లింగ్ పనులకు రూ.214 కోట్లు.
- లాతూర్ బైపాస్ రోడ్ల నిర్మాణానికి రూ.46.95 కోట్లు.
- దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో భద్రతా సదుపాయాల కల్పనకు రూ.891.4 కోట్లు.
- ట్రాక్ రెన్యువల్ పనులకు రూ.1,530 కోట్లు.
- 'కవచ్'కు రూ.41.94 కోట్లు.

నిరుటి కంటే రూ.446.65 కోట్లు అధికం: జైన్

కేంద్ర ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్‌లో ఈసారి దక్షిణ మధ్య రైల్వేకి రూ.14.232.84 కోట్లు కేటాయించినట్టు జోనల్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఇందులో ఏపీకి రూ.9,138 కోట్లు, తెలంగాణకు 5,071 కోట్లు దక్కుతాయని శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిరుటితో పోలిస్తే ఈసారి తమ జోన్‌కు కేటాయింపులు రూ.446.65 కోట్లు పెరిగినట్టు చెప్పారు.

తాటి వనాలు లేకున్నా కల్లు దుకాణాలా?

- రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 50 కి.మీ. పరిధిలో తాటి వనాలు లేకపోయినా కల్లు దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై హైకోర్టు ప్రభుత్వాన్ని నిలదీసింది. సంబంధిత జీవోపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. కల్తీ కల్లు వల్ల 2002-2004 మధ్యకాలంలో 99 మంది మరణించడంతో అప్పటి ప్రభుత్వం కల్లు దుకాణాల మూసివేతకు జీవో జారీ చేసింది. కానీ, 2014 సెప్టెంబర్‌లో ఆ జీవోను రద్దుచేసిన తెలంగాణ ప్రభుత్వం.. పూర్వపు విధానంలో కల్లు దుకాణాల ఏర్పాటుకు వీలుకల్పిస్తూ జీవో జారీ చేసింది. ఆ జీవోను కొట్టేయాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై సీజే అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది.

మేడిగడ్డపై మీ వైఖరి ఏమిటి?

- సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 2, (నమస్తే తెలంగాణ) కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. దీనితోపాటు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ సేకరించిన నిధులపై దర్యాప్తు విషయంలోనూ ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని, ఆ విషయాలను రాతపూర్వకంగా తెలియజేయాలని స్పష్టం చేసింది. మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు ఏ దశలో ఉన్నదో వివరిస్తూ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కాంగ్రెస్ నేత జీ నిరంజన్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు సీజే అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దర్యాప్తు తీరుతెన్నులపై నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.